క్లుప్తంగా

రేపు మెగా హెల్త్ క్యాంపు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎన్నమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపుతోపాటు ఉచిత వాహన సేవను ప్రారంభిస్తున్నట్లు ఆస్పత్రి చైర్మన్ ఎన్నమ్ హరికాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శిబిరాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉచిత మందులతోపాటు జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, షుగర్, బీపీ, రక్త పరీక్షలతోపాటు ఉచితంగా ఈసీజీ తీస్తామని వివరించారు. స్థానికులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యుడు హరికాంత్‌రెడ్డి కోరారు.

క్రికెట్ కిట్ల పంపిణీ



లింగాల: మండలంలోని శాయిన్‌పేటలో శుక్రవారం మాజీ ఎంపీటీసీ లింగస్వామి క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు కిట్లను అందజేసినట్లు తెలిపారు. గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింహులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి



పెంట్లవెల్లి: వరిధాన్యం కొనగోలు వేగవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను నాయకుడు రామన్‌గౌడ్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. వర్షాలు పడుతుండటంతో త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మహిళా సమైక్య సంఘాల వారికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కబీర్, శేషాంద్రప్రసాద్, కుమార్, రవి, నర్సింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈర్ల నర్సింహకు ఘన నివాళి



బిజినేపల్లి: సీపీఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈర్ల నర్సింహ మొదటి వర్ధంతిని శుక్రవారం మండలంలోని వెల్గొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఆయన స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈర్ల నర్సింహ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఈర్ల చంద్రమౌళి, బాలరాంరెడ్డి, పెద్ద బాల్‌రెడ్డి, ఈర్ల భూపేష్ బాబు, ఈర్ల గంగాధర్, అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఉపాధి బిల్లులు చెల్లించాలి

చారకొండ: వేసవిలో కూలీలకు కల్పించిన ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కూలీలకు రెండు నెలలుగా చేసిన పనులకు అరకొర బిల్లులు చెల్లించారని, పెండింగ్‌లో ఉన్న పూర్తి బిల్లులు ఇవ్వాలని పేర్కొన్నారు. పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో విద్యుదాఘాతంతో గురువారం రాత్రి రాము(21) మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని, తక్షణ సహాయంగా రూ.5 వేలు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 22వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గమనించాలని కోరారు.

సాగుకు రైతన్న దూరం

- వన్యప్రాణుల బెడదతో అనాసక్తి
- భూములు బీళ్లుగా మారిన వైనం



మన్ననూర్‌లో బీళ్లుగా మారిన వ్యవసాయ భూములు

మన్ననూర్: వన్య ప్రాణుల భారీ నుంచి పంటలను కాపాడుతూ ప్రభుత్వం ఈ ఏడు పంటల సాగుకు సహకరించి ఆదుకోవాలని అమ్రాబాద్ మండలంలోని రైతులు కోరుతున్నారు. అనుకూలంగా లేని పరిస్థితుల ప్రభావంతో ఆయా గ్రామాలలో పంటలు సాగు చేయడం రైతులకు ఎంతో కష్టంగా మారడంతో వ్యవసాయం చేయడమే విరమించుకున్నారు. మండలంలోని మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి, మన్ననూర్, ప్రశాంతి నగర్ తదితర గ్రామాల్లో ప్రత్యామ్నాయ నీటి వనరులు లేని కారణంగా అధిక శాతం రైతులు వర్షాధారంపైనే ఆధారపడి వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో విత్తనాలు విత్తింది మొదలు పంటలు చేతికి అందే వరకు వన్య ప్రాణుల బెడద అధికంగా ఉండటంతో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని రైతులు వాపోతున్నారు.

సాగుకు అనుకూలంగా ఉన్నా..

ప్రత్యేకించి మన్ననూర్ గ్రామంలో సుమారు 1,950 ఎకరాల భూమి సాగుకు అనుకూలంగా ఉన్నప్పటికి పంటలపై వన్యప్రాణుల దాడిని భరించలేక రైతులు తమ భూములన్ని బీళ్లుగానే ఉంచారు. అనుకూలంగా లేకపోవడం, వర్షాభావ పరిస్థితులు ప్రత్యేకించి గ్రామాల్లో పగటి పూట కోతులు, రాత్రి సమయంలో అడవి పందులు, జింకలు, దుప్పుల బెడద రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సాగు చేసిన పంటలు జంతువుల భారిన పడి కనీస దిగుబడి కూడా రాకపోగా పెట్టుబడులు మీద పడి నష్టాలు వస్తుండటంతో గత రెండేళ్లుగా రైతులు వ్యవసాయ పొలాలను సాగు చేయకుండా స్తబ్ధతగా ఉండిపోయారు. దీంతో గ్రామంలో ఎక్కడ చూసిన వ్యవసాయ భూములన్ని బీళ్లుగానే ఉన్నాయి. కుడి చేతితో సహాయం అందించి ఎడమ చేతితో లాగేసుకుంటున్నట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు ఉందని రైతులు వాపోతున్నారు. పంటల పెట్టుబడిగా ఇచ్చే రైతు బంధు పథకం డబ్బులు పంటలు సాగు చేయని కారణంగా పొట్ట పోసుకోవడం, బ్యాంకులో తీసుకున్న పంట రుణం వడ్డీలు చెల్లించేందుకే సరిపోతుందని రైతులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. మన్ననూర్ గ్రామంలో ప్రజల జనాభా కంటే కోతులే అధికంగా ఉండటంతో గ్రామస్తులు వీటితో ఇంట, బయట తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోతులు, అడవి జంతువులను వ్యవసాయ పొలాల్లోకి రాకుండ కట్టడి చేస్తేనే వ్యవసాయం చేసే ఎరిస్థితి ఉంది. లేని పక్షంలో వ్యవసాయం ఉనికి కోల్పోవడంతో పాటూ రైతులు రోజు కూలీలుగా బతుకు జీవుడా అంటూ వలసలు వెళ్లే పరిస్థితి దాపురిస్తుందని అంటున్నారు. మాచారం గ్రామానికి చెందిన శ్రీమంతుడు జలంధర్ రెడ్డి గత నెల రోజుల కిందట ఆ గ్రామ రైతులు, ప్రజల మేలు కోరుకునే వ్యక్తిగా గ్రామంలోని కోతులను పట్టించి కొంత మేరకు సమస్య పరిష్కరించారు. పాలకులు అధికారులు స్పందించి వ్యవసాయ పొలాలోకి వన్య ప్రాణులు రాకుండా కట్టడి చేసే చర్యలు తీసుకుని ఈ ఏడాది పంటల సాగుకు సహకరించాలని రైతులు కోరుతున్నారు.

పశువుల మేతకు అవస్థలు

వన్య ప్రాణుల బాధలు భరించలేక వ్యవసాయం సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. పశువుల మేత కోసం తమ పశువులను సమీపంలోని అడవికి తీసుకెళ్తే అటవీ శాఖ సిబ్బంది నిబంధనల పేరుతో అడవిలోకి రానివ్వడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో మొత్తంలో 5 ఎకరాలకు మించి వ్యవసాయ భూమి లేని చిన్న సన్నకారు రైతులే అధికంగా ఉన్నారు. పరిస్థితుల ప్రభావం ఇలాగే ఉంటే కాడి ఎద్దులను కూడా కసాయిలకు అమ్ముకునే పరిస్థితి దాపురిస్తుంది.

నష్టాలతో సాగు చేయలేం..



వర్షాధారంపై పొలాలు సాగు చేస్తూ పండించే పంటలకు కోతులు, అడవి పందుల బెడదతో ప్రతి ఏట తీవ్రంగా నష్టపోతున్నాం. గతేడాది స్వంత భూమి రెండు ఎకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తే కనీసం పెట్టుబడులు కూడా రాలేదు. అధికారులు స్పందించి ఈ సారి రైతులు వ్యవసాయం చేసుకునేందుకు సహకరించాలని కోరుతున్నాం.

– వర్రై స్వామి, రైతు, మన్ననూర్

రైతులు ముందుకు రావడంలేదు



కోతులు, అడవి పందుల బెడదతో పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ఆయా గ్రామాలలో పర్యటించి పంటల సాగు, ప్రభుత్వ ప్రోత్సాహం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. నష్టాల భయంతో రైతులు వెనకడుగు వేస్తున్నారు. అధికారుల సూచనలు, సలహాల మేరకు సాగు చేయాలని వివరిస్తున్నా పట్టించుకోవడం లేదు.

–సీతారాం, ఏఈఓ, మన్ననూర్

అసత్య ఆరోపణలు మానుకోవాలి



అచ్చంపేటలో మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్

అచ్చంపేట: పట్టణంలో జరిగిన ఘటనను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజకీయం చేస్తూ అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుంద మల్లికార్జున్ హితువు పలికారు. శుక్రవారం పట్టణంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నిరంకుశ పాలనలో అనేక అక్రమాలు, బెదిరింపులు, దాడులు, కిడ్నాపులతో ప్రజలు భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛా వాతావరణం నెలకొందని, ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రతి ఒక్కరికి స్వేచ్ఛా ఇచ్చారని వివరించారు. ఫాంహౌస్ దొంగలకు సద్ది మోస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గతంలో జరిగిన ఘటనలపై ఎందుకు జోక్యం చేసుకోలేదని ప్రశ్నించారు. కేసీఆర్ దొరల పాలన వద్దు అని ఇప్పుడు కేసీఆర్ పాలన ముద్దు అంటున్నారని ఎద్దేవా చేశారు. రౌడీ రాజ్యాం పోయి ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, గువ్వల నిరంకుశ పాలన పోయి..వంశీకృష్ణ ప్రజా పాలన వచ్చిందన్నారు. ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ జిల్లా నాయకులు దాశరథి పవన్, కృష్ణనాయక్, శివ, చెన్నకేశవులు పాల్గొన్నారు.

కలెక్టర్ ప్రత్యేక పూజలు



అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరం క్షేత్రంలో శుక్రవారం కలెక్టర్ ఉదయ్ కుమార్ కుంటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిపూజ, ఉమాదేవి అమ్మవారికి కుంకుమార్చన, ఉమామహేశ్వరుడికి అభిషేకం చేశారు. అంతకుముందు ముందుగా ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. కలెక్టర్‌ను ఆలయ సంప్రదాయాల ప్రకారం సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు వీరయ్యశాస్త్రిలు ఉన్నారు.

ప్రాజెక్టుల పూర్తికి సహకరించాలి



రంగారెడ్డిని సన్మానిస్తున్న బండెల రామచంద్రారెడ్డి, రైతు సంఘం నాయకులు

కల్వకుర్తిరూరల్: పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్ని పూర్తి చేసేందుకు సంపూర్ణ సహకారం అందించాలని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం సాధన రైతు జేఏసీ కన్వీనర్ బండెల రామచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహదారుడిగా ప్రభుత్వం నియమించిన రిటైర్ట్ ఎస్సీ నల్లవెల్లి రంగారెడ్డిని ఆయన కలిసి సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టుల నిర్మాణం కోసం రంగారెడ్డి చేసిన కృషిని ఆయన కొనియాడారు. రాబోయే రోజుల్లో పాలమూరు, రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చేవిధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన పడిపూజ మహోత్సవం



తాడూరు: మండల కేంద్రంలోని కొమ్ముగుట్ట ప్రాంతంలోని అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెండో పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. చివరిరోజు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం, యజ్ఞం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రోహిణి, ఎంపీటీసీ రేణుక, ఆలయ ధర్మకర్త శ్రీనివాసులు, పూజారి అనురూపశర్మలు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి చక్రం వితరణ



వెండి చక్రం అందజేస్తున్న దాతలు

నాగర్ కర్నూల్: జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీ అభయ హనుమాన్ దేవాలయంలో సంతోషిమాత అమ్మవారికి శుక్రవారం హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన బచ్చు బుచ్చయ్య, పుష్పమ్మ దంపతులు కిలో వెండి చక్రం వితరణ చేశారు. అమ్మవారికి అభిషేకం, విశేషాలంకరణ, కుంకుమార్చన, కలశంపూజ, ఉద్యాపనం, ఒడిబియ్యం, మహా ప్రసాదాల నివేదన, మహామంగళహారతి, ఉయ్యాల సేవ, పావలింపు సేవలను ఆలయ ప్రధాన అర్చకులు అల్లాడి ప్రకాష్ శర్మ వేదమంత్రోచరణాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సరస్వతి, శ్రీనివాసులు, వేణు గోపాల్ రావు, మలిపెద్ది భాగ్యమ్మ, పెద్దమారూర్ రాజేశ్వరి, రాచర్ల శివకుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ రికార్డుల తనిఖీ



చారకొండ: మండలంలోని జూపల్లిలో పంచాయతీ కార్యాలయంలో ఉపాధిహామీకి సంబంధించిన రికార్డులను శుక్రవారం జిల్లా అంబుడ్స్ పర్సన్ జంగయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులకు సంబంధించిన 7 రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనులకు సంబంధించిన ఏడు రికార్డులతో పాటు, మాస్టర్‌కాపీలు, నర్సరీకి సంబంధించిన వివరాలపై నిర్వహణ, పంచాయతీ కార్యాలయం వద్ద ఫిర్యాదుల బాక్స్‌లు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఉన్నత అధికారులకు నివేదికలు అందిస్తామని తెలిపారు.

ప్రారంభానికి సిద్ధంగా తహసీల్దార్ కార్యాలయం



నూతన తహసీల్దార్ కార్యాలయం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. రూ.1.70 కోట్లతో నిర్మాణం చేపట్టిన తహసీల్దార్ కార్యాలయ భవన సముదాయాన్ని నిర్మించారు. భవనానికి రంగులు అద్దుతున్నారు. తలుపులు, కిటికీల బిగిస్తున్నారు. ఈ నెల చివరి వరకు పనులు పూర్తి అయితే జూన్ మొదటి వారంలోనే కార్యాలయం ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయంలో ఇరుకుగదులతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవనంలోకి కార్యాలయాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు మార్చాలి

వెల్దండ: రాష్ట్రంలో త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లల్లో మార్పు చేయాలని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ముదిగొండ రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్లను ప్రభుత్వం మార్పు చేయాలని కోరారు. రిజర్వేషన్ల మార్పు కోసం ఆయా ప్రజలు ఎదురుచూస్తున్నారని ప్రజలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు



తెలకపల్లిలో వ్రతం ఆచరిస్తున్న మహిళా భక్తులు

తెలకపల్లి: కాలజ్ఞాన సృష్టికర్త కలియుగ దైవం విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి 331 ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. శుక్రవారం మండలంలోని కమ్మరెడ్డిపల్లిలో సూరినేని వంశస్తుల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు, కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకుడు మారోజు ఉమాపతాచార్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని స్థానిక చెన్నకేశవ ఆలయ ఆవరణలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన విశ్వబ్రాహ్మణులు ప్రత్యేక పూజలు చేసి వీరబ్రహ్మంగారి చరిత్ర ఆయన జీవిత విశేషాలను తెలియజేశారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. నాయకులు భాస్కరాచారి, అనంత రాములు, కృష్ణమాచారి, తిరుపతాచారి, చంద్రమౌలి, బాలకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీతారాముల బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న భక్తులు

కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జయప్రకాష్‌నగర్ తండాలో వెలిసిన పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. మొదటిరోజు పూజా హోమం, వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కౌన్సిలర్ హుమ్లి, దేవస్థానం చైర్మెన్ హనుమానాయక్, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు



అవగాహన కల్పిస్తున్న ఏఓ మహేష్

బల్మూర్: చిరుధాన్యాల సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ మహేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో శుక్రవారం కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని బిల్లకల్, అంబగిరి, చెంచుగూడెం, బల్మూర్ గ్రామాలకు చెందిన ఆదివాసి చెంచు గిరిజన రైతులకు ఆహార పంటల(చిరుధాన్యాల) సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రకాల పంటల సాగువిధానం, పాటించాల్సిన మెలకువలు, ఎరువుల వాడకం అంశాలను వివరించారు. చిరుధాన్యాలకు మార్కెట్లో ఎంతో డిమాండ్ ఉందని సూచించారు. చిరుధాన్యాల సాగు వలన ఆహార భద్రత కొదవ కూడా ఉండదన్నారు. మండలంలో కోనేరు సంస్థ వారు ఆదివాసి గిరిజన రైతుల కోసం ప్రత్యేకంగా చెంచు ప్రగతి సేవా కేంద్రాలు(సీపీఎస్‌ఏకే)లను ఏర్పాటు చేసి వ్యవసాయ పనిముట్లతో పాటు ఆహార పంటల విత్తనాలు, కూరగాయల విత్తనాలను ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్లు పెద్దులయ్య, ప్రవీన్, ఏఈఓలు పవన్‌కుమార్, శివకృష్ణ, సంస్థ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో అదనపు గదులు



తిర్మలాపూర్ పాఠశాలలో అదనపు తరగతి గదులు

ఉప్పునుంతల: మండలంలోని తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం పూర్తికాకుండనే శిథిలావస్థకు చేరింది. 15 ఏళ్ల కిందట అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు అసంపూర్తిగా చేసి వదిలేశారు. దీంతో అదనపు గదులు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం పాఠశాల కొనసాగుతున్న భవనం పూర్తిగా దెబ్బతినడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. వరదనీరు పాఠశాల తరగదుల్లోకి వచ్చే దుస్థితి నెలకొంది. గతంలో పలుమార్లు అధిక వర్షాలకు పాఠశాల గదుల్లోకి వరదనీరు, మట్టి చేరడంతో పాఠశాల కొనసాగించే పరిస్థితి లేక కొన్ని రోజులు మూతపడింది. కనీసం అదనపు గదుల నిర్మాణం పూర్తిచేస్తే విద్యార్థుల చదువుకు ఎటువంటి ఆటంకం ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు.

అసంపూర్తి రోడ్డుతో అవస్థలు



నాగనూల్, నెల్లికొండ గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న రోడ్డు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని నెల్లికొండ నుంచి నాగనూల్ వరకు 2 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆహార పనికి పథకంలో భాగంగా నిర్మించిన ఈ రోడ్డును వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నాగర్‌కర్నూల్ హైవే రోడ్డునుంచి నెల్లికొండ గ్రామం వరకు బీటీగా మార్చారు. నెల్లికొండ నుంచి నాగనూల్ వరకు నిర్మాణ పనులు వదిలేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పెంట్లవెల్లిలో భారీ వర్షం



పెంట్లవెల్లి కొత్త బస్టాండ్ ప్రాంతంలో కురుస్తున్న వర్షం

కొల్లాపూర్/ పెంట్లవెల్లి: మండలంలో శుక్రవారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు పెంట్లవెల్లి, మంచాలకట్ట, జటప్రోల్, గోప్లాపూర్, కొండూరు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో పెంట్లవెల్లిలోని రహదారుల గుండా, కాలనీల్లో వర్షపు నీరు మోకాళ్లలోతులో రోడ్లపై పారింది. ఎన్నో రోజుల నుంచి విపరీతమైన ఎండలతో సతమతమైన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అలాగే కొల్లాపూర్ పట్టణంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి.



కొల్లాపూర్ పట్టణంలో ఏర్పడిన ఇంద్రధనస్సు



రోడ్లపై పారుతున్న వర్షపునీరు